



ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి దినేశ్ గుండూరావు





కుక్కె సుబ్రహ్మణ్య స్వామి ఆలయం

దేవుడి భూములు భద్రం..!



- మాన్యం ఆస్తుల ఆక్రమణలకు చెక్
- 11,859 ఎకరాలు స్వాధీనం
- ట్రస్టులు, వ్యక్తుల పేరున ఉండే రికార్డుల మార్పు
- ఇది నిరంతర ప్రక్రియ : మంత్రి రామలింగారెడ్డి

బెంగళూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్‌కు చెందిన భూములంటూ రైతులకు నోటీసులు ఇచ్చి స్వాధీనం చేసుకునేందుకు సాగుతున్న ప్రయత్నం వివాదాలకు కారణమవుతున్న తరుణంలోనే రాష్ట్ర దేవదాయశాఖ పకడ్బందీ కార్యాచరణతో 11,859 ఎకరాల భూ ఆక్రమణలకు చెక్ పెట్టింది. ఇలా దేవుళ్ల భూములను భద్రం చేసుకుంది. ఏడాదిన్నర కాలంగా భూముల స్వాధీన ప్రక్రియను దేవదాయశాఖను కొనసాగించింది. తొలివిడతలో రాష్ట్రవ్యాప్తంగా ఏడెనిమిది వేల ఆలయాలకు సంబంధించిన భూములపై సమీక్ష జరిపింది. ఆ తర్వాత వాటిని స్వాధీనం చేసుకునే విధానాన్ని కొనసాగించింది. ఇప్పటివరకు 11,859 ఎకరాల భూమి ఆక్రమణలను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. హాసన్ జిల్లాలో అత్యధికంగా 1633.31 ఎకరాలను స్వాధీనం చేసుకోగా అత్యల్పంగా ధారవాడ జిల్లాలో 7 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. దేవదాయశాఖకు ట్రస్టుల రూపంలో రాజులకాలం నుంచి దానం రూపంలోనూ, ఆ తర్వాత ఇనాం రూపంలోనూ వేలాది ఎకరాలు ప్రాంతాలవారీగా ఆలయాలకు కేటాయించారు. శతాబ్దం క్రితం ప్రతి ఊరికి రెండుమూడు ఆలయాలు ఉండేవి. ఇక చరిత్రను పరిశీలిస్తే తాలూకాలు, హోబళిలు జిల్లా కేంద్రాల వంటి పెద్ద ఊళ్లు, పట్టణాలు, నగరాలలో ఉండే ఆలయాలకు తగినంతగానే భూములు ఎక్కువగా కేటాయించారు. ఆలయాలకు భూములు కేటాయించడం వెనుక అర్చకులకు జీవనోపాధి ఉండాలనే అభిప్రాయం కూడా ఉంది. ఇక గుడి అంటే ఏడాదిలో రెండు మూడు ప్రధానమైన ఉత్సవాలు, జాతరలు, ఊరేగింపులు వంటి కార్యక్రమాలు నిర్వహించేవారు. వివిధ కులవృత్తుల వారు ఉత్సవాలలో పనిచేయాలనే నిబంధన పెట్టి వారికి ఇనాం పేరిట భూములు కేటాయించేవారు. ఇలాంటి ఇనాం భూములకు అప్పట్లో విక్రయాలు ఉండేవి కావు. ఆ తర్వాత మారిన చట్టాలతో వాటిని విక్రయించుకునే వెసలుబాటు వచ్చింది. ఇవే కాకుండా రాజులు, చక్రవర్తులు గుడికోసమే కొంతభూమిని విరాళంగా ఇచ్చారు. ఆ తర్వాత దాతలు కూడా సొంత భూములను కేటాయించారు. ఇలాంటి భూములకు స్పష్టమైన రికార్డులు లేకున్నా దశాబ్దాలకాలంగా దేవుడి భూమిగా పిలిచేవారు. కొన్నిచోట్ల ఆక్రమణలు కూడా కొనసాగాయి. రాజకీయ పలుకుబడి ఇతరత్రా బలం కల్గినవారు ఆలయాల భూములు ఆక్రమించుకున్నట్టు తెలుస్తోంది.

రాష్ట్రంలో 1.86 లక్షల ఆలయాలు ఉన్నాయి. వీటిలో దేవదాయశాఖ అనుబంధంగా 34,564 ఆలయాలు ఉన్నాయి. ఇందులో ఏ కేటగిరీకి చెందినవి 205 కాగా, బి కేటగిరీకి చెందినవి 193 ఉన్నాయి. సీ కేటగిరీలో 34,166 ఆలయాలు ఉన్నాయి. 2023 మేలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడేనాటికి 3,914 ఎకరాలకు సంబంధించి ఆలయ భూములకు మాత్రమే రికార్డులు ఉండేవి. సదరు భూములు ఆలయాల పేరుతోనే రికార్డులు నమోదు చేశారు. దేవదాయశాఖకు అనుబంధంగా 34,564 ఆలయాలు ఉన్నా వాటికి సంబంధించిన ఆస్తులు సమగ్రంగా రికార్డులు నమోదు చేయలేదు. పట్టాలు, మ్యుటేషన్ రికార్డులు గుడిపేరిట స్పష్టంగా దాఖలు చేయలేదు. కొన్ని ఆలయాలకు సంబంధించిన భూములు వ్యక్తులు, అనధికారిక ట్రస్టుల పేరుతోనే రికార్డులు నమోదయ్యాయి.

2008 నుంచి దేవాలయాలకు సంబంధించిన భూములను గుర్తించి వాటి రికార్డులను సరిచేసి ఆలయాల పేరిట నమోదు చేయించే ప్రక్రియ ప్రారంభించారు. 2023 వరకు భూములను గుర్తించే విధానమే సజావుగా సాగలేదు. 2023 తర్వాత భూములను గుర్తించడంతోపాటు రికార్డులు సక్రమం చేయడం వేగవంతం చేశారు. హాసన్ జిల్లాలో ఆలయాలకు సంబంధించి 1663.31 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. చిక్కమగళూరు జిల్లాలో 1435.12 ఎకరాలు, కలబురగిలో 1172.13 ఎకరాలు, మైసూరు జిల్లాలో 1164.17 ఎకరాలు, తుమకూరులో 1123.30 ఎకరాలు, మండ్య జిల్లాలో 1070 ఎకరాలు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 7485 సర్వే నెంబర్లలో ఆలయాలకు సంబంధించిన ఆస్తులు ఉన్నట్లు గుర్తించి వాటి సరిహద్దులను పొందుపరిచారు. ఆలయాలకు చెందిన భూములే అయినా వ్యక్తుల పేరిట, ట్రస్టుల పేరిట ఉండేవాటిని పూర్తిగా మార్పు చేసి ఆలయాల పేరుతోనే రికార్డులు చేశారు. 6వేలకుపైగా సర్వే నెంబర్లలోని ఆస్తుల సర్వే, రికార్డుల పరిశీలన, సవరణ వంటి ప్రక్రియ ఏడాదిన్నరలో జరిగింది. దక్షిణకన్నడ జిల్లా కుక్కె సుబ్రమణ్య, హాసన్‌లోని బేలూరు చన్నకేశవస్వామి ఆలయం, మాసళె శ్రీరామ ఆలయం, భాగేశపురలోని ఆంజనేయస్వామి ఆలయం, నరగరహళ్లిలలోని తిరుమల ఆలయం, కాలనకెరెలోని ఆంజనేయస్వామి ఆలయం, యాదగిరి జిల్లాలోని హొయసళేశ్వరి ఆలయం వంటి ప్రముఖమైన గుడుల భూముల రికార్డులను పదిలం చేశారు.

ఇది నిరంతర ప్రక్రియ : మంత్రి రామలింగారెడ్డి

దేవదాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఆలయాలకు సంబంధించిన భూముల రికార్డులు కోరితే ఎక్కడా సక్రమంగా లేవని తేలిందని మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. ప్రస్తుతానికి 11,859 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నామని, ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. ప్రతినెలా ఆలయాల భూములపై సర్వే, రికార్డుల పరిశీలన, సవరణ, స్వాధీనం వంటి విధానంపై జిల్లాలవారీగా సమీక్షలు జరపాలని దేవదాయశాఖ ముఖ్యఅధికారులకు సూచించానన్నారు.

పాతదే.. ప్రాణాంతకం కాదు..!



- హెచ్ఎంపీవీపై ఆందోళన వద్దు
- వదంతులను నమ్మకండి.. జాగ్రత్తలు చాలు
- మార్గదర్శకాలు జారీ చేసిన ఆరోగ్యశాఖ
- ఉన్నతాధికారులతో మంత్రి గుండూరావ్ సమీక్ష

బెంగళూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బయట పడిన వైరస్‌పై ఆందోళన అవసరం లేదని అధికారులు ప్రకటించారు. ఇది కొత్తగా వచ్చిన వైరస్ కాదని..పాతదేనని ప్రాణాంతకం కాదని వెల్లడించారు. సోమవారం బెంగళూరులో రెండు హెచ్ఎంపీవీ కేసులు బయట పడడంతో ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఆరోగ్యసౌధలో ఉన్నతస్థాయి అధికారులతో మంత్రి దినేశ్‌గుండూరావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఈ వైరస్ కొత్తదేమీ కాదని, ప్రాణాంతకం కూడా కాదన్నారు. ఈ విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఆందోళన వీడి తగిన జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చలిజ్వరం తరహాలోనే ఇది కూడా ఒక అనారోగ్యమన్నారు. ఇప్పటికే హెచ్ఎంపీవీ సోకిన ఒక చిన్నారి కోలుకున్నాడని, మరో శిశువు మంగళవారం డిశ్చార్జ్ కానున్నట్లు తెలిపారు. అనవసరం ఆందోళనతో అనారోగ్యం పాలు కావద్దని, ముఖ్యంగా సోషల్ మీడియాలో వదంతులను ప్రచారం చేయవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మార్గదర్శకాలివే...

కుటుంబ ఆరోగ్యసంక్షేమశాఖ ఈమేరకు ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. హ్యూమన్ మెటా నిమో వైరస్ (హెచ్ఎంపీవీ) చైనాలో ప్రబలిన తరుణంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది. సాధారణ జలుబు, ఫ్లూ తరహాలోనే శీతాకాలంలో ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది తలెత్తే వైరస్ అన్నారు. ప్రత్యేకించి చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దగ్గు లేదా తుమ్ము వస్తే ఇతరులకు ఇబ్బంది లేకుండా నోటిని, ముక్కును కవర్ చేసేలా హ్యాండ్ కర్చీఫ్ వాడాలన్నారు. చేతులను తరచుగా సోప్ లేదా ఆల్కహాల్ బేస్డ్ శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలన్నారు. రద్దీ ప్రాంతాలకు దూరంగా ఉండాలన్నారు. తగినంత గాలి, వెలుతురు కల్గిన ప్రదేశంలో ఉండాలన్నారు. పౌష్టికాహారం, తగినంత నీరు తీసుకోవాలన్నారు. కాగా అనారోగ్యానికి గురైతే సొంత వైద్యం కాకుండా వైద్యులను సంప్రదించి తగిన మందులు వాడాలని సూచించారు.





ధర్మస్థళ మంజునాథ ఆలయం

మంజునాథుడి దర్శనం మరింత సులభం..

- తిరుమల తరహాలో ప్రత్యేక క్యూ వ్యవస్థ
- నేడు ప్రారంభించనున్న ఉపరాష్ట్రపతి

బెంగళూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నిత్యం వేలాదిమంది భక్తులు కలియుగదైవం వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వస్తున్నా పటిష్టమైన క్యూ లైన్ల వ్యవస్థతో భక్తులకు ఇబ్బంది లేకుండా టీటీడీ చూస్తున్నారు. ఇదే తరహాలో కర్ణాటక రాష్ట్రం దక్షిణ కన్నడ జిల్లాలో వెలసిన ప్రముఖ శైవక్షేత్రం ధర్మస్థళ మంజునాథస్వామిని దర్శించుకునేందుకు దక్షిణాది రాష్ట్రాల నుంచే కాకుండా దేశ విదేశాలనుంచి భక్తులు వస్తుంటారు. అయితే నిత్యం భక్తులు ఇక్కడ గంటల తరబడి వేచియుండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ధర్మస్థళ ఆలయం 'శ్రీ సాన్నిధ్యం' పేరిట క్యూ కాంప్లెక్స్‌ను నిర్మించారు. ఇది తిరుమలలోని క్యూలైన్ల తరహాలోనే ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఒక దేవాలయానికి ఇటువంటి క్యూలైన్ల విధానం ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. భక్తులు సేద తీరేందుకు 16 భవనాలను నిర్మించారు. ప్రతి భవనంలోనూ 800మంది బస చేసే అవకాశం ఉంది. భక్తులు నిలబడాల్సిన అవసరం ఉండదు. కుర్చీలు ఏర్పాటు చేశారు. ఒక షెడ్‌నుంచి మరో షెడ్‌కు వెళ్లే విధానం ఏర్పాటు చేశారు. భవనాల్లో పిల్లలకు ప్రత్యేక విభాగం, శౌచాలయం ఏర్పాట్లు చేశారు. సకల సౌకర్యాలతో 2.75లక్షల చదరపు అడుగులతో రెండు అంతస్థుల పద్ధతిలో కాంపెన్స్‌ను నిర్మించారు. ఆధునాతనమైన సాంకేతిక విధానాలను ఏర్పాటు చేశారు. 16 విశాలమైన షెడ్లలో భక్తులు సేద తీరేందుకు వీలుంటుంది. ఇకపై లైన్లలో ఎక్కువ సమయం వేచియుండాల్సిన అవసరం ఉండదు. ఇక్కడ క్యాంటీన్ల సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు. ప్రతిచోటా నేమ్‌బోర్డులతోపాటు ధర్మస్థళ చరిత్ర, పరంపరకు రుజువుచేసేలాంటి ఆకర్షణీయమైన కళాఖండాలను అమర్చారు. ఇకపై ధర్మస్థళకు వెళ్లే భక్తులు గంటలతరబడి లైన్లో కూర్చోవాల్సిన అవసరం లేకుండా షెడ్లలో గడిపేందుకు వీలుంది. మంగళవారం ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్ లాంఛనంగా శ్రీ 'సాన్నిధ్యం'ను ప్రారంభించనున్నారు. డాక్టర్ సుదేశ్ ధనకర్, ధర్మస్థళ ధర్మాధికారి వీరేంద్రహెగ్డే,

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు, ఎంపీ కెప్టెన్ బ్రిజేశ్‌చౌట, స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌పూంజాలు పాల్గొంటారు. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో ధర్మస్థళ మంజునాథస్వామి ప్రసిద్ధి చెందినది. ఇక్కడికి రోజూ వేలాదిమంది భక్తులు వస్తుంటారు. నేత్రావతి నదిలో స్నానం చేసి మంజునాథస్వామిని దర్శించుకునే సంప్రదాయం ఉంది. దశాబ్దాలకాలంగా ఇక్కడ భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తారు. కొవిడ్ కాలంలో మినహా నిత్యం అన్నదానం కొనసాగింది. రాష్ట్రంలో ఏడాదిన్నక్రితం 'శక్తి'గ్యారెంటీ పథకం ప్రారంభం కావడంతో రోజూ ధర్మస్థళకు మహిళా భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో దర్శనం కోసం ఆరేడుగంటలనుంచి 10 గంటలకుపైగా వేచియుండాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. భక్తుల సంఖ్య పెరగడంతో సౌకర్యాల్లో మార్పులు తీసుకు రావడానికే క్యూలైన్ షెడ్‌లు ఏర్పాటు చేశారు.



ధర్మస్థళలో నూతనంగా నిర్మించిన కాంప్లెక్స్

మల్లన్నకు బ్రహ్మరథం



శ్రీశైల మల్లికార్జునుడు కల్యాణోత్సవ రథం

భ్రమరాంబిక అమ్మవారు

శ్రీశైల మల్లన్నకు భక్తులు బ్రహ్మరథం పట్టారు. బళ్లారి నగరం ఓంకార నాదంతో మార్మోగింది. శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో పర్యటిస్తున్న కల్యాణ రథం సోమవారం బళ్లారికి చేరకుంది. భక్తులు భక్తి శ్రద్ధలతో మల్లికార్జున స్వామి, భ్రమరాంబలకు స్వాగతం పలికారు.

8



సంగీత వ్యవస్థాపకుడు నారాయణరెడ్డి, ఎండీ సుభాష్‌చంద్రకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆంధ్రజ్యోతి జీఎం జీవీ శ్రీకాంత్



సంగీత గాడ్జెట్స్ షోరూం

గాడ్జెట్స్‌తో సంగీత మరో అడుగు

బెంగళూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొబైల్స్ రిటైల్స్‌లో ప్రముఖ కంపెనీగా కొనసాగుతున్న సంగీత మొబైల్స్ సంస్థ గాడ్జెట్స్ విక్రయాలకోసం మరో అడుగు ముందుకేసింది. జేపీనగర్‌లో సర్వాంగ సుందరంగా నిర్మించిన సంగీత కాంప్లెక్స్‌లో గాడ్జెట్స్ షోరూంకు లాంఛనంగా శ్రీకారం చుట్టింది. వివిధ కంపెనీల ప్రముఖులు వ్యాపార దిగ్గజాలతో సోమవారం రాత్రి సంగీత ఎండీ సుభాష్ చంద్ర భేటీ అయ్యారు. ఆంధ్రజ్యోతి జనరల్ మేనేజర్ జి.వి.శ్రీకాంత్ సంగీత కొత్తకాంప్లెక్స్ ప్రారంభించడంతోపాటు గాడ్జెట్స్ ఉత్పత్తుల విక్రయాలకు శ్రీకారం చుట్టిన మేరకు ప్రత్యేకంగా అభినందించారు. సంగీత వ్యవస్థాపకులు నారాయణరెడ్డి, ఎండీ సుభాష్‌చంద్రలకు పుష్పగుచ్ఛాన్ని అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. సంగీత డైరెక్టర్ చందుతోపాటు పలువురు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న బెంగళూరు గ్రామీణ ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్, వేదికపై రైతుపోరాట నేతలు తదితరులు

బలవంతంగా లాక్కుంటే సహించం..!

- కంపెనీల పేరుతో సారవంతమైన భూముల స్వాధీనం సరికాదు : రైతు సంఘాల ఆగ్రహం

దొమ్మసంద్ర, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కంపెనీల పేరుతో రైతుల భూములు లాక్కుంటే సహించేది లేదని రైతు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. బెంగళూరు గ్రామీణ జిల్లా పరిధిలో రైతులనుంచి బలవంతంగా భూములను కేఐఏడీబీ (కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలప్‌మెంట్ బోర్డు)స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడంపై అన్నదాతలు ఆక్రోశం వ్యక్తం చేశారు. సర్జాపుర గ్రామంలోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ క్రీడామైదానంలో మన భూమి మన హక్కు నినాదంతో సమావేశం నిర్వహించారు. బెంగళూరు గ్రామీణ ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్ ప్రసంగిస్తూ రైతుల అంగీకారం లేకుండా భూములను స్వాధీనం చేసుకోవాలని కేఐఏడీబీ అధికారులు వ్యవహరించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము పరిశ్రమలకు వ్యతిరేకం కాదని అయితే అయితే సారవంతమైన భూములను కేటాయించాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. రానురాను వ్యవసాయం చేసేవారు తగ్గుతున్నారని ఇటువంటి తరుణంలో రైతులనుంచి బలవంతంగా సారవంతమైన భూముల ద్వారా ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలని భావించడం సరికాదన్నారు. ఖాళీ భూములలో ఏదైనా సంస్థలు ఏర్పాటు చేసుకోవాలని అభిప్రాయపడ్డారు. గతంలో కేఐఏడీబీకి ఇచ్చిన భూములు ఖాళీగా ఉన్నాయని అయినా కూడా మళ్లీ ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ అంశాన్ని లోక్‌సభ సమావేశాల్లో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. పర్యావరణవేత్త డాక్టర్ యల్లప్పరెడ్డి మాట్లాడుతూ మనిషికి భోజనం ఎంత అవసరమో మౌలిక సదుపాయాలు కూడా అంతే ముఖ్యమన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా కంపెనీలు నిబంధనలు పాటించాలన్నారు. కేంద్ర మాజీ మంత్రి ఏ నారాయణ స్వామి మాట్లాడుతూ ఇప్పటికే బెంగళూరు నగరంలో 8 పారిశ్రామిక ప్రదేశాలు ఉన్నాయని వీటిలో 50-60శాతం మాత్రమే భర్తీ కాగా మిగిలిన స్థలం ఖాళీగా ఉందన్నారు. ఎమ్మెల్యే శివణ్ణ, ఎమ్మెల్సీ గోపినాథరెడ్డి, కేఐఏడీబీ భూస్వాధీన వ్యతిరేక పోరాట సమితి గౌరవాధ్యక్షుడు జయప్రకాశ్, అధ్యక్షుడు దేవరాజు, ఉపాధ్యక్షుడు నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.


తాగునీటికి ఢోకాలేదు..

- 5 నెలలుగా కేఆర్‌ఎస్‌లో పూర్తిస్థాయి నీటి మట్టం
- 30ఏళ్లలో ఇదే రికార్డు .. అధికారుల ప్రకటన
- బెంగళూరులో ఈ ఏడాది నీటి కరువు లేనట్టే..

బెంగళూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండ్య, మైసూరు జిల్లాల జీవనాడి కృష్ణరాజసాగర్ జలాశయంలో సమృద్ధిగా నీరు తొణికిసలాడుతుండడంతో ఈ ఏడాది బెంగళూరు నగరానికి తాగునీటికి ఢోకా లేదని అధికారులు పేర్కొంటున్నారు. కేఆర్‌ఎస్‌లో 154 రోజులుగా గరిష్ఠనీటి మట్టం 124.80 అడుగుల రికార్డు నీటి మట్టం నమోదైంది. కేఆర్‌ఎస్ గరిష్ఠనీటిమట్టం 124.80 అడుగులుగా ఉంది. 2024 ఆగస్టు 17న జలాశయం నిండింది. అదే ఏడాది డిసెంబరు 21వరకు గరిష్ఠంగా కొనసాగింది. జనవరి 5న ఆదివారం నాటికి 124.30 అడుగుల గరిష్ఠ నీటి మట్టం కొనసాగింది. జనవరిలోనూ కేఆర్‌ఎస్ ప్రాజెక్టులో 124 అడుగుల కంటే ఎక్కువ నీరు ఉండడం గడిచిన 30ఏళ్ల కాలంలో ఇదే తొలిసారి. ప్రస్తుతానికి 154 రోజులు గరిష్ఠంగా పూర్తిస్థాయి నీటిమట్టం కొనసాగింది.

2024 ఏప్రిల్ మూడోవారం దాకా రాష్ట్రంలో కరువు కొనసాగింది. ఆ ప్రభావం కేఆర్‌ఎస్ ప్రాజెక్టుపైనా చూపింది. జలాశయానికి నీరు చేరుతుందా. ఈ ఏడాది పంటలు పండుతాయా... అనే ఆందోళన ఆయకట్టు రైతుల్లో కొనసాగింది. జూన్ 29వ తేదీ నాటికి కూడా కేఆర్‌ఎస్‌లో 90 అడుగులు మాత్రమే నీరు ఉండేది. ఆ తర్వాత కొడగు జిల్లాతోపాటు కేరళ రాష్ట్రం వయనాడ్ ప్రదేశంలో నిరంతరంగా వర్షాలు కురవడంతో ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. జూలై 11నాటికే కేఆర్‌ఎస్ నీటిమట్టం 124 అడుగులకు చేరింది.

సుప్రీంకోర్టు తీర్పు కంటే ఎక్కువగానే తమిళనాడుకు కావేరీ నీటిని విడుదల చేశారు. మండ్య జిల్లా రైతులలో హర్షం కొనసాగుతోంది. వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. జలాశయంలో 124.30 అడుగులతో 48.75 టీఎంసీల నీరు నిల్వ ఉంది. టీఎంసీల ప్రకారమైతే గరిష్ఠంగా 49.452 టీఎంసీలు ఉండాల్సి ఉంది. కావేరి ఆయకట్టు పరిధిలోని 174 చెరువులలో 142 చెరువులను భర్తీ చేశారు. మరో 20 చెరువులకు 75శాతం, ఒక చెరువుకు 50శాతం, రెండు చెరువులకు 25శాతం నీటితో భర్తీ చేశారు. కేఆర్‌ఎస్‌లో గరిష్ఠంగా నీటిమట్టం 2009లో 146 రోజులు ఉండగా 2022లో 114 రోజులు, 2024లో 154 రోజులు గరిష్ఠంగా పూర్తిస్థాయిలో నీరు ఉంది. చెరువులు, జలాశయంలో పూర్తిగా నీరు ఉండడంతో వేసవికాలంలోనూ ఇటు ఆయకట్టు ప్రాంతాలకే కాకుండా బెంగళూరు ప్రజలకు తాగునీటికి ఢోకా ఉండదని జలమండలి అధికారులు అభిప్రాయపడ్డారు.



జలకళతో కేఆర్‌ఎస్ డ్యామ్

ఫారిన్ లాంగ్వేజ్‌తో ఉపాధి అవకాశాలు


ఫలితాలను విడుదల చేస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్/సెంట్రల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విదేశీ భాషా నైపుణ్యాలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ అనిత పేర్కొన్నారు. ఎస్కేయూ-ఆర్డీటీ సంయుక్తంగా నిర్వహించిన ఫారిన్ లాంగ్వేజెస్ ఆన్‌లైన్ కోర్సు ఫలితాలను సోమవారం వీసీ చాంబర్‌లో విడుదల చేశారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్‌లో ఆర్డీటీ ప్రొఫెషనల్ స్కూల్ నుంచి జర్మన్ 45, స్పానిష్ 42, ఫ్రెంచ్ 46 మొత్తం 133మంది విద్యార్థులు కోర్సు పూర్తి చేశారు. వీరందరూ ఉత్తీర్ణత సాధించారు. ఫారిన్ లాంగ్వేజ్ పూర్తి చేసిన అభ్యర్థులకు దేశంలో, విదేశాలలో కచ్చితంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయని వీసీ అనిత తెలిపారు. ఆర్డీటీతో కలిసి కోర్సు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ కృష్ణకుమార్తి, డీన్ నరసింహన్, డైరెక్టర్ రమణ, ఎగ్జామినేషన్ కంట్రోలర్ లోకేశ్వర్లు, సూపరింటెండెంట్ చంద్రారెడ్డి, ఆర్డీటీ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ మోహన్‌మురళీ, ప్రిన్సిపాల్ గీతాంజలి, జర్మన్ టీచర్ సెశోలియా తదితరులు పాల్గొన్నారు.

చందురుని మించు..

విశాల గగనతలం నుంచి జగతికి చైతన్యం ఒనర్చే దినకరుడు ప్రశాంత ప్రకృతిలో మయూఖతంత్రుల తీవ్రతను వీడి శీతాకాలపు చలికి పగలే వెన్నెల కురిపించే జాబిల్లిలా మారాడు.


చంద్రుని వలే ప్రకాశిస్తున్న.. సూర్యుడు

గత కొన్ని రోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోయాయి. బారెడు పొద్దెక్కినా పొగమంచు ప్రభావంతో వాతావరణం చల్లగా ఉంటోంది. పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రభావం ఇంకాస్త ఎక్కువగా ఉంది. అనునిత్యం అరుణ వర్ణంతో ఉదయించే సూర్యుడు మంచు మసుగులో వెండి వెన్నెల పంచే చంద్రుడిలా అగుపిస్తూ ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్నాడు. ఈ సుందర దృశ్యం బుక్కపట్నం మండలం గసికవారిపల్లిలో సోమవారం ఉదయం అగుపించింది.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం రూరల్

న్యూస్ బాక్స్

సర్టిఫికెట్లు ధ్రువీకరించుకోండి

అనంతపురం విద్య, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే ప్రత్యేక అవసరాలున్న(సీడబ్ల్యూఎస్ఎన్) విద్యార్థులు తమ ఒరిజినల్ పీహెచ్ సర్టిఫికెట్లను ధ్రువీకరించుకోవాలని డీఈఓ ప్రసాద్ బాబు, ఏసీ గోవింద్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలపై స్కూల్ ప్రధానోపాధ్యాయుల సంతకం, సీల్ వేయించి కమలానగర్‌లోని పాత డీఈఓ ఆఫీస్‌లో సంప్రదించాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 317 మంది విద్యార్థులు ఈ నెల 8,9 తేదీల్లో హాజరై ధ్రువీకరించుకోవాలని ఆయన సూచించారు.

ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ పరీక్షల ఫలితాలను సోమవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నవంబరు, డిసెంబరులో ఎంబీఏ మూడో సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీతోపాటు నాలుగో సెమిస్టర్(ఆర్21) పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఎంసీఏ మూడో సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్ అండ్ సప్లిమెంటరీ, మూడు, నాలుగు, ఐదో సెమిస్టర్ల(ఆర్17,21) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం www.jntuaresults.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈ శివకుమార్, ఏసీఈలు శేఖర్‌రాజు, అంకారావు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

స్టడీ తర్వాతే చర్యలు

జిల్లా ఆస్పత్రి ఏఓ మల్లికార్జునరెడ్డి



అనంతపురం టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సర్వజనాస్పత్రి ఏఓ(అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)గా మల్లికార్జున రెడ్డి ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు, రోగులకు మెరుగైన సేవలు అందించే విషయంగా పలు వివరాలు వెల్లడించారు. తొలుత ఆస్పత్రిలో పరిస్థితులను అధ్యయనం చేసి ఆతర్వాత ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆలోచిస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి: ఆస్పత్రిలో కొరవడిన పర్యవేక్షణను మీరెలా సరిచేస్తారు?

ఏఓ: మా మాతృశాఖ రెవెన్యూ డిపార్ట్‌మెంట్. డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న మమ్మల్ని జిల్లా ఆస్పత్రికి ఏఓగా నియమించారు. కొత్తకాబట్టి ముందుగా ఏఏ విభాగాలు ఉన్నాయి. అక్కడ ఎంత మంది పనిచేస్తున్నారో స్టడీ చేస్తున్నా.

ఆంధ్రజ్యోతి: ఆస్పత్రిని చక్కదిద్దేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ఏఓ: తొలుత అన్నివిషయాలు తెలుసుకున్న తర్వాత ఆస్పత్రి నియమ నిబంధనలు అందరూ పాటించేలా సూపరింటెండెంట్‌తో కలిసి తగిన ఆదేశాలు ఇస్తాం. అప్పటికీ మారకపోతే శాఖాపరమైన చర్యలు ఉంటాయి.


ఆంధ్రజ్యోతి: ఆస్పత్రిలో సమయపాలనను ఎలా సరిచేస్తారు?

ఏఓ: నాతొలి ప్రాధాన్యం నిరంతరం పర్యవేక్షణ చేయడమే. రోజుకు రెండు మూడుసార్లు ఆకస్మిక తనిఖీలు చేస్తా. అపుడు డ్యూటీలో ఉండాల్సిన వారు ఉన్నారా లేదా అని పరిశీలిస్తాం. ముఖ హాజరు వేసిన వారు డ్యూటీ ముగిసేవరకు ఉండాల్సిందే, అలాఉండకండా ఎక్కడికో వెళ్లి ఉంటే మాత్రం చర్యలు తప్పవు. మరోవైపు గాడిలో పడటానికి అవసరమైతే మూడుసార్లు హాజరు వేసేలా చూస్తాం

ఆంధ్రజ్యోతి: మీదేమో రెవెన్యూ శాఖ మరి డాక్టర్లతో ఎలా కలిసిపోతారు?

ఏఓ: మాది రెవెన్యూ శాఖ అయినా ప్రభుత్వం మాకు ఈ పెద్ద బాధ్యతలు అప్పగించింది. అలాంటపుడు ఎంతో చిత్తశుద్ధితో వ్యవహరించాల్సి ఉంటుంది, అందరితో సఖ్యతగా ఉంటూనే రోగులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందేలా చూస్తా. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతియంత్రం, పరికరం వినియోగించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

అంత సీన్ లేదు..!



హెచ్ఎంపీవీకి భయపడొద్దు

సాధారణ ఫ్లూ లక్షణాలే ఉంటాయి

జాగ్రత్తలు పాటిస్తే నయమౌతుంది

డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రియాంక

అనంతపురం టౌన్/హిందూపురం అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కొవిడ్ తరువాత ఎక్కడ ఏ వైరస్ వచ్చినా విపరీతమైన చర్చ జరుగుతోంది. దాని గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి, అది హానికరమా కాదా..? వైద్యం అందుబాటులో ఉందా..? వైరస్ సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి..? ఇలా అనేక చర్చలు జరుగుతుంటాయి. తాజాగా చైనాలో ప్రబలుతున్న హ్యూమన్ మెటానిమో వైరస్ (హెచ్ఎంపీవీ) గురించి అలాంటి చర్చే జరుగుతోంది. ఉమ్మడి జిల్లా ప్రజలు ఎక్కువగా వెళ్లి వచ్చే బెంగళూరు నగరంలో ఇద్దరు చిన్నారులకు ఈ వైరస్ సోకిందని తెలియగానే ఒక రకమైన కలకలం రేగింది. కానీ ఇదేమీ కొత్త వైరస్ కాదని, పెద్ద ప్రమాదకారి కూడా కాదని వైద్య నిపుణులు అంటున్నారు. దీనికి ప్రత్యేక వైద్యం అంటూ ఏమీ లేదని, అందుబాటులో ఉన్న సాధారణ వైద్యంతోనే నయమౌతుందని కూడా భరోసా ఇస్తున్నారు. బెంగళూరులో రెండు కేసులు నమోదైనట్లు తెలిసేలోగానే బాధిత చిన్నారుల్లో ఒకరు కోలుకోవడం.. ఈ వైరస్ గురించి పెద్దగా భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తోంది. అయితే, వ్యాధి ఏదైనా నిర్లక్ష్యం చేయకూడదు. సొంత వైద్యాన్ని మానేసి.. వైద్య నిపుణులను సంప్రదించాలి. వారి సూచనలకు అనుగుణంగానే ఔషధాలను వాడాలి. లేదంటే ఇతర సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. అందులోనూ హెచ్ఎంపీవీ శ్వాసకోశ సంబంధిత సమస్యలను తెస్తుంది. బ్రాంకైటిస్, ఆస్తమా వంటి దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారికి ఇది అదనపు సమస్య అవుతుంది. కాబట్టి.. జాగ్రత్తలు పాటించడం, చికిత్స చేయించుకోవడం తప్పనిసరి.

ఇవీ.. లక్షణాలు

హ్యూమన్ మెటానిమో వైరస్ సోకినవారికి సాధారణ ఫ్లూ లక్షణాలు ఉంటాయి. తరచూ జ్వరం వస్తుంది. నీరసంగా ఉంటారు. జలుబు, దగ్గు, ముక్కు దిబ్బడ, ముక్కులో నీరుకారడం, గొంతునొప్పి వంటి శ్వాసకోశ సంబంధిత సమస్యలు కనిపిస్తాయి. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ వైరస్ సోకితే నిమోనియా, ఆస్తమాకు దారి తీసే ప్రమాదం ఉంటుంది.

ఏం చేయాలి..?

హెచ్ఎంపీవీ గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు అంటున్నారు. తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. కొవిడ్ సమయంలో పాటించిన జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందని అంటున్నారు. ఈ వైరస్ సోకకుండా చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. రద్దీగా ఉండే ప్రదేశాలకు అవసరమైతే తప్ప వెళ్లకూడదు. దగ్గినపుడు, తుమ్మినపుడు చేతి రుమాలును అడ్డుపెట్టుకోవాలి. అకస్మాత్తుగా తుమ్ములు వస్తే.. అరచేతిని కాకుండా, చేయి మడిచి.. మోచేతిప్రాంతాన్ని అడ్డుపెట్టుకోవాలి. ఈ పద్ధతిని కొవిడ్ సమయంలో వైద్య నిపుణులు సూచించారు. వైరస్ సోకిన లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించి, చికిత్స చేయించుకోవాలి. బయట తిరగకుండా, ఇంట్లోనే ఉంటూ విశ్రాంతి తీసుకోవాలి. లక్షణాలు ఉన్నవ్యక్తులు వాడిన వస్తువులను ఇతరులు వాడకూడదు.

భయపడాల్సిన పనిలేదు



హెచ్ఎంపీవీ వైరస్‌తో పెద్దగా భయపడాల్సిన పనిలేదు. ఈ వ్యాధి ఇంతకు ముందు కూడా ఉంది. చైనాలో ఇటీవల ఎక్కువగా ఉందనే వార్త ఆ నోట ఈ నోట వెలువడటంతో ప్రజల్లో భయందోళనలు ఉన్నాయి. వాతావరణంలో మార్పుల వల్ల చలి పెరగడంతో కాస్త జలుబు, దగ్గు, జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. వీటికి భయపడాల్సిన పనిలేదు. జాగ్రత్తలు తీసుకుంటే నయమవుతుంది. చిన్న పిల్లలను చలి నుంచి కాపాడుకుంటూ ఉన్ని దుస్తులు ధరింపజేయాలి.

-శివకుమార్, చిన్నపిల్లల వైద్యుడు, హిందూపురం

జాగ్రత్తలే రక్ష..



హెచ్ఎంపీవీ వైరస్ ప్రభావం పెద్దగా లేదు. జిల్లాలో ఆ వైరస్ కేసులు నమోదు కాలేదు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. హెచ్ఎంపీ బాధితులకు నిర్దిష్టమైన చికిత్స లేదు, వ్యాక్సిన్ కూడా లేదు. ఇది సాధారణ ఫ్లూ మాత్రమే. జాగ్రత్తలు తీసుకుంటే నయమవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వైరస్ గురించి ఆలోచిస్తున్నాయి. పై నుంచి వచ్చే సూచనలకు అనుగుణంగా జిల్లాలో జాగ్రత్తలు తీసుకుంటాము. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందిస్తాం.

- డాక్టర్ ఈబీ దేవి, డీఎంహెచ్ఓ

అంత డేంజర్‌కాదు..



హెచ్ఎంపీవీ వైరస్ కరోనా కన్నా పెద్ద ప్రమాదకరమైనది కాదు. ఈ వైరస్ సోకితే సాధారణంగా వచ్చే జలుబు, దగ్గు, గొంతునొప్పి, తలనొప్పి ఉంటాయి. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి శ్వాసకోశ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఇది అంటువ్యాధి. కాబట్టి కొవిడ్ సమయంలో తీసుకున్న జాగ్రత్తలనే ఇప్పుడూ తీసుకుంటే సరిపోతుంది. ఈ కేసుల నిర్ధారణకు ఇంకా ఎలాంటి సూచనలు, నిబంధనలు రాలేదు.

- డాక్టరు ప్రియాంక, మైక్రోబయాలజీ విభాగం ప్రొఫెసర్, మెడికల్ కళాశాల

19న గిరిజన ఆదివాసీ సమ్మేళనం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి గిరిజన ఆదివాసీ సమ్మేళన సభను విజయవాడలో నిర్వహించనున్నట్లు గిరిజన ప్రజాసమాఖ్య (జీపీఎస్) జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్ తెలిపారు. సమ్మేళనసభకు సంబంధించిన పోస్టర్లను సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గిరిజన ఆదివాసీ సమ్మేళన సభ నిర్వహిస్తామన్నారు. గిరిజనుల జీవన శైలి, సమస్యలు, ఆధునిక జీవన పురోగతి, పరిష్కారమార్గాలు, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలపై సమ్మేళనంలో చర్చించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్‌నాయక్, ఏపీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్రావు, సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్, కేరళ ఐజీ లక్ష్మణ్‌నాయక్, మాజీ ఎంపీ సీతారాం, బెంగళూరు ఎర్రా భాస్కర్‌నాయక్ తదితరులు హాజరవుతారన్నారు. పోస్టర్ల విడుదల కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ రవిరాజ్, జీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసునాయక్, సలహాదారుడు నారాయణస్వామి నాయక్, జిల్లా అధ్యక్షుడు సాకే ఆనంద్, రాయలసీమ అధ్యక్షుడు భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో అనంత బాలోత్సవాలు: డీఈఓ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు తదితరులు

అనంతపురం కల్చరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 14, 15, 16వ తేదీల్లో నిర్వహించనున్న అనంత బాలోత్సవంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని డీఈఓ ప్రసాద్‌బాబు పిలుపునిచ్చారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన అనంత పిల్లల పండుగ-5 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ నిత్యం చదువులు, మార్కుల వేటలో సతమతమయ్యే విద్యార్థులకు సృజనాత్మకత, కళానైపుణ్యం వంటివి ప్రదర్శించడానికి అనంత బాలోత్సవం చక్కటి వేదికగా ఉపయోగపడుతుందన్నారు. బాలోత్సవంలో భాగంగా అకాడమిక్, కల్చరల్, సాంస్కృతిక, జానపద కళలు, వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, ఆటలు, పాటలు, క్విజ్, సైన్స్ ఎగ్జిబిషన్ వంటి మొత్తం 62 రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనే విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలు, విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందిస్తామని తెలిపారు. వేడుకలకు కవులు, మేధావులు, విద్యావంతులు హాజరై విద్యార్థులను ఉత్తేజపరచాలని కోరారు. బాలోత్సవ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ విద్యార్థులు ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ కోశాధికారి జిలాన్, డీఈఓ కార్యాలయ ఏడీ ఆదినారాయణ, బాలోత్సవ కమిటీ నాయకులు ఎల్ఆర్ రమణ, పరమేష్, చంద్రిక, అశ్విని, సురేష్, సిద్దు, గిరి, భీమేష్, సాయి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సారూ.. యాడుండారు?

పత్తాలేని వ్యవసాయాధికారి

సమస్యలతో రైతుల ఇబ్బందులు

ఆందోళన చేసినా తీరుమార్చుకోని ఏఓ

డి.హీరేహాళ్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారి కృష్ణకిషోర్‌రెడ్డి తీరుతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈయన నెలల తరబడి కార్యాలయానికి రాకుండా, విధుల్లో అలసత్వం చూపుతున్నారని రైతులు విమర్శిస్తున్నారు. కనీసం ఫోన్‌లో కూడా ఈయన దొరకడని రైతులు వాపోతున్నారు. మండలంలో 30కిపైగా గ్రామాలు కలిగి ఉన్నాయి. ఈ గ్రామాల్లో 80 శాతానికిపైగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. రైతులకు ఏ సమస్యలు వచ్చినా మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ కార్యాలయానికి వస్తారు. కానీ ఇక్కడ వ్యవసాయాధికారి అందుబాటులో లేకపోవడంతో రైతులు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఐదేళ్ల నుంచి ఇక్కడే విధులు నిర్వహిస్తున్నా వ్యవసాయాధికారి కృష్ణ కిషోర్ రెడ్డిని మండలంలో 50 శాత మంది రైతులు కూడా చూడలేదు. మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ కార్యాలయం తలుపులు నెలలో ఒక్కసారి కూడా తీయలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ అధికారి కొన్నేళ్లుగా గ్రీవెన్స్‌లో గాని, మండల సమావేశంలోగాని పాల్గొనడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ గైర్హాజరుపై ప్రజాప్రతినిధులు సైతం ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. రైతులు, ప్రజాసంఘాల నాయకులు మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించినా ఆ అధికారి తీరులో మార్పు లేదు.



డి.హీరేహాళ్ వ్యవసాయశాఖ కార్యాలయం

చర్యలు తీసుకోవాలి



నేను మురడి గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నా. ప్రజాప్రతినిధిగా వ్యవసాయానికి సంబంధించి ఏవైనా సమస్యల కోసం వెళితే అవి పరిష్కారం కావు. ఎందుకంటే ఆఫీసులో మండల వ్యవసాయాధికారు ఎప్పుడూ అందుబాటులో ఉండరు. నెలల తరబడి మాలాంటి ప్రజాప్రతినిధులకు కూడా ఆయన అందుబాటులో లేకపోతే ఇక రైతుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఉన్నతాధికారులు ఈయనపై చర్యలు చేపట్టి కొత్త వ్యవసాయ అధికారిని నియమించాలని కోరుతున్నాం.

- గంగాధర, ఎంపీటీసీ, మురడి

విచారించి, చర్యలు చేపడతాం

వారంలో ఒకరోజు తప్ప ప్రతినిత్యం అక్కడ అధికారి రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందే. ప్రతి రోజూ ఒక సచివాలయాన్ని సందర్శించి అక్కడ గ్రామ వ్యవసాయ సహాయకుడితో చర్చించి, రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే త్వరితిగతిన పరిష్కరించాలి. అయితే ఇక్కడ వ్యవసాయ అధికారి అందుబాటులో ఉండటం లేదన్న విషయం ఈ మధ్యనే మా దృష్టికి వచ్చింది. ఎవరైనా రైతులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే, విచారించి చర్యలు తీసుకుంటాం.

- లక్ష్మణ్‌నాయక్, ఏడీఏ

మా సమస్యలు పరిష్కరించేదెవరు?



మండలంలో రైతులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించే అధికారే లేకుండా పోయారు. అసలు మండలంలో వ్యవసాయాధికారి ఉన్నాడో లేడో కూడా అర్థం కావడం లేదు. నేను 40 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నా. గతంలో సేద్యంలో ఏవైనా సమస్యలు వస్తే అధికారులను సంప్రదించేవాళ్లం. అధికారులు కూడా నిత్యం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేవారు. కానీ ఈయన విధులలో చేరినప్పటి నుంచి నేటి వరకు ఎప్పుడైనా ఫోన్‌లో మాట్లాడటం తప్ప కనిపించిన దాఖలాలు లేవు. అందుకే అసలు మండల వ్యవసాయ కార్యాలయానికి రావడమే మానేశాం.

- ఎర్రిస్వామిరెడ్డి, రైతు, చెర్లోపల్లి

మేకను ఎత్తుకెళ్లిన చిరుత

ధర్మవరం రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల గ్రామ పరిధి రేకులమాను ప్రాంతంలో మేకను సోమవారం చిరుత ఎత్తుకెళ్లింది. మేకల యాజమాని గొల్ల నారాయణస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుక్కపట్నం మండలం క్రిష్ణాపురం గ్రామానికి చెందిన నారాయణస్వామి తనకున్న 50 మేకలను మేపు కోసం ధర్మవరం మండలం ఏలుకుంట్ల గ్రామ పొలాల్లోకి తోలుకెళ్లాడు. మేకలు మేస్తుండగా అతడు సమీపంలోని గుట్టమీద కూర్చున్నాడు. ఉన్నఫలంగా మేకలు అరవడంతో కిందికి దిగి చూశాడు. ఓ మేకను చిరుత నోటికి కరిపించుకుని ఈడ్చుకెళ్లడం చూశాడు. దీంతో భయాందోళనకు లోనై మేకలను పక్కకు తోలుకొచ్చాడు. మేకను చిరుత ఎత్తుకెళ్లడంతో రూ.10వేలు నష్టపోయినట్లు నారాయణ స్వామి ఆవేదన చెందాడు. విషయం గ్రామస్థులకు తెలపడంతో వారు భయాందోళనకు లోనవుతున్నారు.

45 గొర్రెపిల్లల మృతి


గొర్రె పిల్లల కళేబరాలను చూపుతున్న కాపరి

రాయదుర్గం రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చదం గొల్లలదొడ్డి గ్రామంలో చిరుతపులి దాడిలో 45 గొర్రెపిల్లలు సోమవారం మృతిచెందాయి. గ్రామానికి చెందిన కాపరులు ము త్తప్ప, బొమ్మయ్య, గంగాధరలు అయ్యప్ప స్వామి గుడి వద్ద ఉన్న ముత్తప్ప తోటలో గొర్రెల మందను తోలారు. ఉదయం పిల్లలను అక్కడే వదిలేసి గొర్రెలను మేపేందుకు అడవికి వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో చిరుతపులి దాడి చేసి దాదాపు 45 గొర్రె పిల్లలను చంపింది. మరో పది గొర్రెపిల్లల పరిస్థితి విషమంగా ఉందని కాపరులు చెప్పారు. సుమారు రూ. 2.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు వారు వాపోయారు. పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి సంఘటనాస్థలాన్ని పరిశీలించి, వివరాలను సేకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

అనంతపురం సెంట్రల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ లెక్చరర్ల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికైంది. సోమవారం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన ఎన్నికలకు అధికారి(ఆర్వో)గా వైస్ ప్రిన్సిపాల్ శశాంకమౌళి వ్యవహరించారు. అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ(రాయదుర్గం), ఉపాధ్యక్షుడిగా రామచంద్ర(అనంతపురం), కార్యదర్శిగా మనోహర్‌రెడ్డి(అనంతపురం) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు శశాంకమౌళి ప్రకటించారు. సంయుక్త కార్యదర్శిగా ఈశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా జ్యోత్స్న, రాష్ట్ర కౌన్సిలర్లుగా శ్యాంప్రసాద్, శివశంకర్, బృంద, జమీల, టీబీ ఎన్నికైనట్లు పేర్కొన్నారు.


ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ

గంగపుత్రులు అన్నిరంగాల్లో రాణించాలి

రాయదుర్గం రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గంగపుత్రులుగా పిలువబడే బెస్త కులస్థులు రాజకీయ, ఆర్థిక, విద్య అన్ని రంగాలలో రాణించాలని బెస్తసంఘం జిల్లా అధ్యక్షుడు రమణ పేర్కొన్నారు. పట్టణంలోని భంభంస్వామి ఆశ్రమంలో సోమవారం బెస్తకులస్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించి మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెస్తలను రాజకీయ పార్టీలు ఓటుబ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయన్నారు. అనేక సమస్యలు, పేదరికంతో బాధపడుతున్న బెస్తలను అన్ని రాజకీయ పార్టీలు సముచితస్థానం కల్పించి ఆదుకోవాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు జోక్యం చేసుకుని సున్నపుగుట్ట దురాక్రమణ కాకుండా శ్మశానవాటికగానే బెస్తలకు అప్పగించాలని తీర్మానించామన్నారు. బెస్తలకు కులదైవమైన గంగమ్మ దేవాలయానికి స్థలం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలన్నారు.

కమిటీ ఏర్పాటు

గౌరవ అధ్యక్షురాలిగా కమలమ్మ, అధ్యక్షుడిగా గోవిందరాజులు, ఉపాధ్యక్షులుగా పవన్‌స్వామి, కార్యదర్శిగా నాగరాజు, కమిటీ సభ్యులుగా మహేశ్వర్, రాజు, మీ సేవ నాగేంద్ర, ఆర్టీసీ నాగరాజు, టీచర్ ఎర్రిస్వామి, శ్రీరాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


మాట్లాడుతున్న బెస్తసంఘం జిల్లా అధ్యక్షుడు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

ఇర్ఫాన్ ఖాన్ (జయంతి)



హిందీ సినీ రంగంలో పేరొందిన నటుడు 'పద్మశ్రీ' గ్రహీత ఇర్ఫాన్ ఖాన్ 1967 జనవరి 7న రాజస్థాన్ రాష్ట్రం టోంక్‌లో జన్మించారు. బ్రిటిష్, అమెరికన్ సినిమాలలోనూ నటించారు. 30ఏళ్లలో నేషనల్ ఫిల్మ్ అవార్డ్, ఏసియన్ ఫిల్మ్ అవార్డ్, 4 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు పొందారు. ఆయన సినిమాలు ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ హిట్ సాధించాయి. 'స్లమ్‌డాగ్ మిలియనీర్' సినిమాతో అంతర్జాతీయ గుర్తింపు పొందారు. రాజస్థాన్ రాష్ట్ర రాయబారిగా వ్యవహరించారు. 2020 ఏప్రిల్ 29న కన్నుమూశారు.

మల్లంపల్లి సోమశేఖర శర్మ (వర్ధంతి)



సుప్రసిద్ధ తెలుగు చారిత్రక పరిశోధకుడు, పురాలిపి శాస్త్రజ్ఞుడు మల్లంపల్లి సోమశేఖరశర్మ 1891 డిసెంబరు 9న పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం మినిమించిలిపాడు గ్రామంలో జన్మించారు. నాటికీ నేటికీ ఆంధ్ర చరిత్రకారుల్లో అగ్ర తాంబూలానికి అర్హత సాధించిన పరిశోధక శిఖామణి. 'విజ్ఞాన సర్వస్వం' రూపకల్పనలో ఒకరు. పాత్రికేయుడిగా జీవితం ప్రారంభించారు. ఆయన కథలు, నాటకాలు, నవలలు, పద్యాలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. సేకరించిన శాసనాలను విశ్లేషిస్తూ పలుపత్రికలలో వ్యాసాలు రాశారు. 1963 జనవరి 7న కన్నుమూశారు.

బాల్ ముండ్కుర్ (వర్ధంతి)



దేశంలో పేరొందిన ప్రకటనల విభాగం ఉల్కా సంస్థ సంస్థాపకులుగా బాల్ ముండ్కుర్ చిర పరిచితులు. దేశ ప్రకటనల విభాగంలో కీలకంగా వ్యవహరించారు. ఉల్కా ఏజెన్సీ సంస్థ దేశంలో మూడోస్థానంలో నిలిచింది. ముండ్కుర్ తొలుత నావల్ ఆఫీసర్, తర్వాత కమర్షియల్ ఎయిర్ లైన్ పైలట్‌గా పేరొందారు. అనంతరం 1961లో ఉల్కాను స్థాపించి ప్రకటనల విభాగంలో సరికొత్త ఒరవడి సృష్టించారు. అనంతరం ఈ సంస్థ డ్రాఫ్ట్ ఎఫ్‌సీబీ ఉల్కాగా పేరు మారింది. ఏఏఏఐ అధ్యక్షుడిగా కొనసాగారు. 2012 జనవరి 7న గోవాలోని నివాసంలో కన్నుమూశారు.

బి. సరోజాదేవి (పుట్టినరోజు)




బహుభాషా నటి 'పద్మభూషణ్' గ్రహీత భైరప్ప సరోజాదేవి 1938 జనవరి 7న బెంగళూరులో జన్మించారు. తమిళ, కన్నడ, తెలుగు, హిందీ భాషలలో 180కుపైగా సినిమాలలో సినిమాలలో నటించారు. 1955లో 'మహాకవి కాళిదాస' కన్నడ సినిమాకు జాతీయ అవార్డు దక్కగా అందులో కేరక్టర్ నటిగా నటించారు. 1958లో 'నాడోడి మన్నన్' తమిళసినిమా ఎంజీఆర్‌తో నటించి పేరొందారు. తెలుగులో జగదేకవీరునికథ, దానవీరశూరకర్ణ వంటి సినిమాలలో నటించారు. పద్మశ్రీ, కళైమామణి, బెంగళూరు యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్, ఇతర గౌరవాలు పొందారు.

శోభా డే (పుట్టినరోజు)



శోభా డే 1948 జనవరి 7న మహారాష్ట్రలోని ముంబైలో జన్మించారు. దేశంలో ప్రముఖ కాలమిస్ట్‌గా, నవలా రచయిత్రిగా పేరొందారు. పాత్రికేయరంగంలో రాణిస్తూ స్టార్‌డస్ట్, సొసైటీ, సెలెబ్రిటీ పత్రికలకు ఫౌండర్ ఎడిటర్‌గా వ్యవహరించారు. ది టైమ్స్ ఆఫ్ ఇండియా, ఏషియన్ ఏజ్ వంటి పత్రికలలో వీక్లీ కాలమ్స్ నిర్వహించారు. బుల్లితెర సీరియల్ 'స్వాభిమాన్'కు రచయితగా ఉన్నారు. ప్రముఖ దిన పత్రికలు, మ్యాగజైన్‌లకు ఫ్రీలాన్స్ రైటర్‌గా కొనసాగుతున్నారు.

భాగ్యరాజ్ (పుట్టినరోజు)



ప్రముఖ దర్శకుడు, తమిళ నటుడు కె.భాగ్యరాజ్ 1953 జనవరి 7న తమిళనాడు రాష్ట్రం ఈరోడ్‌లో జన్మించారు. ఆయన స్క్రీన్‌రైటర్, సంగీత దర్శకుడు, నిర్మాతగాను రాణించారు. తెలుగు, హిందీ సినిమాలు, టీవీ సీరియల్స్‌కు రచన దర్శకత్వం వహించినా ప్రత్యేకించి తమిళంలో పేరొందారు. 75కుపైగా సినిమాలలో నటించగా 25కుపైగా సినిమాలకు దర్శకత్వం వహించారు. 'భాగ్య' వార పత్రికకు సంపాదకులు. 2014 సైమా లైఫ్‌టైమ్ అచీవ్ మెంట్ అవార్డు, తమిళనాడు ప్రభుత్వం తరపున ఉత్తమ నటుడు పురస్కారంతోపాటు పలు అవార్డులు పొందారు.

వేలం పాటతో ఆదాయం

నల్లచెరువు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి దేవాస్థానంలో టెంకాయలు, పూజా సామగ్రి, పూల హారా లు, విడిపూలు విక్రయించుకోవడానికి సోమవారం ఈఓ పి.నర సింహరాజు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. టెంకాయల రూ.2.60 లక్షలకు రెడ్డెప్ప దక్కించుకున్నారు. పూలహారాలు, విడి పూలు విక్రయించుకోవడానికి రూ28 వేలకు బి. సాంబశివ దక్కించుకున్నారు. సంవత్సరానికి (శ్రావణమాసం మినహాయించి) ఈ వేలం నిర్వహించినట్లు ఈఓ, పర్యవేక్షణాధికారి బి. వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

గోదాదేవిగా వాసవీమాత

తాడిమర్రి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ధనుర్మా సాన్ని పురష్క రించుకుని తాడి మర్రిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి మూల విరాట్‌కు సోమవారం గోదాదేవి అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మ వారికి పట్టువస్త్రాలు, పూలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకుని పూజలు చేయించారు.



సహకార బ్యాంకు ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారుల విజయం

బంగారపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని చిక్కఅంకండహళ్ళి గ్రామ వ్యవసాయ సేవా సహకార గ్రామీణ అభివృద్ధి (వీఎస్ఎస్ఎన్) బ్యాంకు డైరెక్టర్‌ల స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులు గెలుపు సాధించడంపై ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సహకార బ్యాంకు డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికల్లో జరిగాయి. 15 స్థానాలకుగాను 11 స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారులు సూలికుంటె రఘునాథ్, బూదికోటె పుష్ప, బంగారపేట హెచ్‌కె నారాయణస్వామి, చిక్కఅంకండహళ్ళి నారాయణగౌడలు గెలుపు సాధించారు. అయితే హోసూరు కృష్ణప్ప తన ప్రత్యర్థి బాలకృష్ణపై ఓటమి చవిచూశారు.

డిపాజిట్ కోల్పోయిన ఎన్డీయే అభ్యర్థులు

ఎన్డీయే మైత్రి కూటమిలో అభ్యర్థుల కొరత కారణంగా కాంగ్రెస్ నుంచి రప్పించుకుని పోటీ చేయించారు. అయితే డిపాజిట్ కూడా దక్కకుండా ఘోరంగా ఓటమి చెందారు. కాగా కాంగ్రెస్ మద్దతుదారుల విజయోత్సవం సందర్భంగా మైత్రి కూటమి అభ్యర్థి బాలకృష్ణ, కార్యకర్తలతో వాగ్వాదం చేయడం గందరగోళానికి దారి తీసింది. పోలీసులు జోక్యం చేసుకుని అడ్డుకోవడంతో పెద్దసమస్య తొలగినట్టయ్యింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ మద్దతుదారులు 14మంది గెలుపు సాధించారని, కొందరి అధికారుల కారణంగా మైత్రి కూటమి అభ్యర్థి ఒకరు గెలుపొందారన్నారు. ఎన్డీయే కార్యకర్తలు అనవసరంగా గందరగోళం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. వీరి రౌడీయిజం, గూండా ప్రవర్తనకు భయపడేది లేదని, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. హోసూరు కృష్ణప్ప కాంగ్రెస్‌లో ప్రముఖ నాయకుడిగా ఉండడంతో పీఎల్‌డీ బ్యాంకులో నామినేటెడ్ సభ్యుడిగా నియమించారు. ఆయన సహకారంతో చిక్కఅంకండహళ్ళి వీఎస్ఎస్ఎన్ ఎన్నికల్లో కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ సాధించడం ద్వారా అధికారాన్ని దక్కించుకోగలిగింది. ఈ సందర్భంగా పురసభ అధ్యక్షుడు గోవింద, బూదికోటె బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చందు, గ్యారెంటీ పథకాల సమితి అధ్యక్షుడు పార్థసారథి, షఫి, జీవన్, వీణా వెంకటేశ్, పురసభ సభ్యుడు వెంకటేశ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకు డైరెక్టర్ల విజయోత్సవంలో ఎమ్మెల్యే తదితరులు

గ్రామీణ విద్యాప్రగతికి చక్కటి బాటలు

విజయపుర, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలక్రితం గ్రామీణ ప్రాంతాలలో ఉన్నత విద్యకు బెంగళూరు ఇతర దూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉండేదని ఇటువంటి తరుణంలో ప్రగతి విద్యాసంస్థను 38మందితో ప్రారంభించారని బెంగళూరు గ్రామీణ జిల్లా ఇన్‌చార్జ్ మునియప్ప స్మరించుకున్నారు. విద్యాసంస్థల 29వ వార్షికోత్సవంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం 3,500మందికిపైగా విద్యార్థులు ఉన్నారన్నారు. ప్రత్యేకంగా దివంగత మాళిగెప్ప, చిన్నప్పలు ప్రగతి విద్యాసంస్థల ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారన్నారు. వార్షికోత్సవంలో రెండో రోజు సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. ఎండీ కృపాశంకర్ మాట్లాడుతూ 'ఒక పుస్తకం వేలాది ఊహలు' అనే నానుడిని ప్రస్తావిస్తూ వార్షికోత్సవంలో భాగంగా పుస్తకమేళా ఏర్పాటు చేశామన్నారు. పిల్లల్లో పఠనాసక్తి పెంచడమే లక్ష్యమన్నారు. విద్యాసంస్థ పాలనాధికారి రజతాపటేల్, నగరేశ్వర ఎడ్యుకేషన్ ట్రస్టు అధ్యక్షుడు ఎం సతీశ్‌కుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రకాశ్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బసవరాజు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి మునియప్పకు సన్మానం

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న పోలీసులు, సిబ్బంది

బాగేపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రజలు సజావుగా సంచరించేందుకు ఆటంకాలు ఏర్పడుతున్న తరుణంలో పురసభ ముఖ్యాధికారి ఎం శ్రీనివాస్, పట్టణ సీఐ ప్రశాంత్‌వర్ధి నేతృత్వంలో సోమవారం ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. పురసభ పరిధిలోని డీవీజీ రోడ్డు, గూళూరు రోడ్డు, ఇతర మార్గాలలో బహిరంగ ప్రదేశాలలో పెట్టె అంగడి (బంకులు), పూలు, పండ్ల, ఇతర దుకాణాల షెడ్లను తొలగించారు. పొక్లైనర్ ద్వారా తొలగించి వ్యర్థాలను ట్రాక్టర్‌లో తరలించారు. పురసభ అధికారుల కార్యాచరణ సమాచారం అందుకున్న కొందరు స్వచ్ఛందంగా ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. పురసభ ముఖ్యాధికారి ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ఎవరిపైనా ద్వేషం లేదని కోర్టు సూచన మేరకు ప్రజలు సహకరించాలని ఇప్పటికే సూచించామని ఈమేరకు కార్యాచరణ చేపట్టామన్నారు.

బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం

విజయనగర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): చామరాజపేట నియోజకవర్గం రాయపుర వార్డు జగజ్జీవన్‌రాం సర్కిల్‌లోని బాలికల కళాశాలలో ఆధునీకరించిన బ్యాడ్మింటన్ కోర్టును వసతి, గృహ నిర్మాణ శాఖ మంత్రి బిజడ్ జమీర్‌ఖాన్ లాంఛనంగా ప్రారంభించారు. సోమవారం ఏర్పాటైన కార్యక్రమంలో మైనారిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధ్యక్షుడు అల్తాఫ్‌ఖాన్‌తో కలసి మంత్రి బ్యాడ్మింటన్ ఆడారు. తొలుత జగజ్జీవన్‌రాం నగర్ వార్డులో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. రామేగౌడ, మంత్రి వ్యక్తిగత కార్యదర్శి మహ్మద్ అయూబ్‌పాష స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ ఆడుతున్న మంత్రి జమీర్

ఉన్నత లక్ష్యం, శ్రమతోనే విజయం



సాధకులకు సన్మానం

చిక్కబళ్ళాపుర, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని నాగార్జున సాంకేతిక మహావిద్యాలయలో పూర్వవిద్యార్థుల సమావేశం జరిగింది. రిజాయిస్ 2025 పేరిట కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రవిశంకర్ మాట్లాడుతూ విద్యతోపాటు ఏ రంగంలో రాణించాలన్నా ఉన్నత లక్ష్యం, అందుకు తగిన శ్రమ ఉండాలన్నారు. మనదేశంలో విద్యా వంతు లు, మేధావులకు కొరతలేదని, ప్రపంచం మొత్తం మనదేశ సాంకేతికతవైపు దృష్టి సారిస్తోందన్నారు. యువత కూడా నైపుణ్యాన్ని పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకు నిదర్శనంగా కళాశాలలో చదివి డాక్టరేట్ పట్టా పొంది ప్రత్యేక సంస్థ అధినేతగా ఎంపిక కావడం కావడం సంతోషకర మన్నారు. సమావేశంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేశ్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకులకు రిజర్వేషన్లు పెంచాలి

మహదేవపుర, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి సామాజికవర్గ విద్యార్థుల ఆర్థిక పురోగతికి కోసం రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం ఉందని వాల్మీకి గురుపీఠం అధ్యక్షుడు ప్రసన్నానంద స్వామిజీ అభిప్రాయపడ్డారు. కేఆర్‌పురలో వాల్మీకి జనకల్యాణ కో-ఆపరేటివ్ సొసైటీని ప్రారంభించి మాట్లాడారు. వాల్మీకి సామాజికవర్గం వారు రాష్ట్రంకోసం త్యాగ బలిదానాలు చేశారన్నారు. మదకరి నాయక వంటి నాయకులు తమ ప్రాణాలను త్యాగం చేశారని స్మరించుకున్నారు. కేంద్రమంత్రి శోభాకరండ్లాజె మాట్లాడుతూ మహర్షి వాల్మీకి పేరిట సొసైటీ ఏర్పాటు కావడం సంతోషించదగ్గ అంశమన్నారు. నాయక సామాజికవర్గ ప్రజల అనుకూలం కోసం, పేద విద్యార్థులకు అండగా సహకారసంఘం పనిచేయాలని ఆకాంక్షించారు. ఇదే సందర్భంగా వివిధరంగాల సాధకులను సత్కరించారు. కార్యక్రమంలో మంత్రి రాజణ్ణ, ఎమ్మెల్యే బసవరాజ్, మాజీ మంత్రి శ్రీరాములు, సంఘం అధ్యక్షుడు బాక్సర్ నాగరాజ్, డైరెక్టర్ కట్టుగొల్లహళ్ళి శివకుమార్, జీకే నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిని వెలిగిస్తున్న వాల్మీకి గురుపీఠం అధ్యక్షుడు ప్రసన్నానంద స్వామి తదితరులు

పౌర కార్మికులకు స్వెట్టర్ల పంపిణీ



స్వెట్టర్లు పంపిణీ చేస్తున్న పురసభ ఉపాధ్యక్షురాలు సుజాత తదితరులు

బాగేపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో పౌరకార్మికుల శ్రమ ఎంతో ఉందని వారి సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇస్తున్నట్టు పురసభ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జయ ప్రకాశ్‌నారాయణ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని పురసభకు చెందిన వందమంది పౌరకార్మికులు, జలమండలి సిబ్బందికి స్వెట్టర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండా, వాన, చలి లెక్కించకుండా పట్టణాన్ని స్వచ్ఛంగా ఉంచడంలో పౌరకార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని వారి బాగోగులను పట్టించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. పట్టణంలోని 23 వార్డులనుంచి చెత్త సేకరిస్తూ ఆరోగ్యకరమైన సమాజం కోసం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పురసభ ముఖ్య అధికారి ఎం శ్రీనివాస్, పురసభ అధ్యక్షుడు ఏ శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు సుజాత నరసింహనాయుడు, బీఆర్ నరసింహనాయుడు, సిబ్బంది అతావుల్లా, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

డైరీల పంపిణీ

శిడ్లఘట్ట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని పాత్రికేయులకు డైరీలు పంపిణీ చేశారు. సంస్థ యోజనాధికారి సురేశ్‌గౌడ 'నిరంతర' మాసిక పుస్తకాన్ని, డైరీలను అందచేసి మాట్లాడారు. ధర్మస్థళ ధర్మాధికారి వీరేంద్ర హెగ్డే సారథ్యంలో అన్ని గ్రామాలలో సంస్థ కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమాలు విజయవంతం అయ్యేందుకు సహకరిస్తున్న మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. సీనియర్ పాత్రికేయుడు రూపసి రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలకు ధర్మస్థళ సంస్థ ఎంతో చేయూతనిస్తోందని కొనియాడారు. ప్రత్యేకించి వృద్ధులకు పింఛను, నిరుపేదలకు ఇల్లు, చెరువుల అభివృద్ధి, నిరుపేద కుటుంబాలకు ప్రతినెలా రూ.వెయ్యి ప్రోత్సాహకం అందచేస్తోందన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు మునేగౌడ, నాగరాజు, నామంగల జగదీశ్, తమామ్‌పాషా, నరసింహగౌడ, నంది రాజేశ్, లోకేశ్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు

మహదేవపుర, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని హాలనాయకన హళ్ళి, కొడతి గ్రామపంచాతీ పరిధిలో రూ.5కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇతర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మంజుళా లింబావళి భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నియోజకపరిధిలోని ప్రజలందరికీ మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. పనులలో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మహదేవపుర టౌన్ హోబళి బీజేపీ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, బీజేపీ ప్రముఖులు నాగేశ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బెళ్ళందూరు సురేశ్, కేశవ, బాబురెడ్డి, వాలెపుర సోమశేఖర్, ముళ్ళూరు శ్రీనివాస్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మంజుళా లింబావళి

ఢిల్లీ బయల్దేరిన విమానం బెంగళూరులో అత్యవసర ల్యాండింగ్

బెంగళూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బెంగళూరు విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయల్దేరిన ఎయిరిండియా విమానం అత్యవసరంగా కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండింగ్ అయ్యింది. సోమవారం సాయంత్రం టేకాఫ్ అయిన విమానం ఇంజన్‌లో లోపం ఏర్పడినట్టు పైలట్‌లు గుర్తించారు. వెంటనే ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోల్‌కు సమాచారం అందించి అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ప్రయాణీకులంతా సురక్షితమని వారికి ప్రత్యామ్నాయమైన విమాన వ్యవస్థ కల్పించినట్టు ఎయిరిండియా ప్రకటించింది.

ఓంశక్తి ఆలయానికి వెళ్తుండగా బస్సు ప్రమాదం

» 15మందికి గాయాలు



చికిత్స పొందుతున్న ప్రయాణీకులు

చింతామణి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని ప్రముఖ శక్తిదేవత మేల్ మరువత్తూర్‌లోని ఓంశక్తి ఆలయానికి చింతామణి నుంచి కేఎస్ఆర్టీసీ బస్సులో వెళ్తుండగా సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లా బంగారుపాలెం సమీపాన మొగిలి వద్ద ప్రమాదానికి గురైంది. ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఘటనలో 15మంది గాయపడినట్టు సమాచారం. పట్టణంలోని బెంగళూరు డబుల్ రోడ్డులోని కన్నంపల్లికి చెందిన భక్తులు కేఎస్ఆర్టీసీ బస్సులో బయల్దేరారు. జాతీయ రహదారిపై టెంపో ఒకటి అతివేగంగా నిర్లక్ష్యంగా వచ్చింది. స్పీడ్‌బ్రేకర్ వద్ద బస్సును స్లో చేసిన సందర్భంలో వెనుకనుంచి టెంపో, బస్సును ఢీకొంది. దీంతో బస్సు రోడ్డుడివైడర్‌ను ఢీ కొని ముందుభాగం తీవ్రంగా దెబ్బతింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ పాపిరెడ్డి సహా బస్సు ముందుభాగంలో కూర్చున్న పలువురు ప్రయాణీకులు గాయాలపాలయ్యారు. కొందరికి తీవ్ర గాయాలు కాగా మరికొందరికి కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. సమాచారం అందుకున్న బంగారపాలెం పోలీసులు వెంటనే స్పందించి అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను బంగారుపాలె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స పొందిన అనంతరం పలువురు ప్రయాణీకులు సోమవారం ఉదయం మరో కేఎస్ఆర్టీసీ బస్సులో మేల్‌వరువత్తూరుకు బయల్దేరారు. కొంతమంది మాత్రం ఇంకా చికిత్సలు పొందుతున్నట్టు సమాచారం.



ప్రమాదానికి గురైన బస్సు ఇదే...

విషపు స్వీట్ బాక్స్ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడు, స్వీట్‌బాక్స్

బెంగళూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విధానపరిషత్ సభ్యుడు డాక్టర్ ధనంజయ సర్జి పేరును దుర్వినియోగం చేసి ముగ్గురు ప్రముఖులకు నూతన సంవత్సరం రోజున విషపూరితమైన స్వీట్స్ బాక్స్‌ను కొరియర్ ద్వారా పంపిన కేసులో శివమొగ్గ కోటె పోలీసులు ఎట్టకేలకు నిందితుడిని అరెస్టు చేశారు. భద్రావతి నివాసి సౌహార్ద పటేల్ నిందితుడు. ఇతను ఎమ్మెల్సీ ధనంజయసర్జి పేరిట శివమొగ్గ నగరంలోని రాష్ట్రీయ విద్యాసంస్థ కార్యదర్శి నాగరాజ్, వైద్యులు అరవింద్, కేఎస్ పవిత్రాలకు విషపూరిత స్వీట్‌బాక్స్‌ను పంపించాడు. మానసిక రోగి అయిన సౌహార్దపటేల్ వ్యక్తిగత ద్వేషాలతో ఇలా వ్యవహరించినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం సౌహార్ద పటేల్‌ను జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఎల్ఎల్‌బి చదివే వేళ ఒక యువతిని ప్రేమించాడు. అయితే సదరు యువతిని విద్యాసంస్థ కార్యదర్శి నాగరాజ్ దూరం చేశాడు. దీంతో అతను మానసికంగా కుంగినట్టు తెలుస్తోంది. మానసిక వైద్యులు అరవింద్, పవిత్రాల వద్ద చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నాడు. నిత్యం మాత్రలు మింగాల్సి వచ్చేలా చేసిన వైద్యులపై కోపం పెంచుకున్నాడు. ఇలా మాత్రలను పొడి చేసి స్వీట్‌లో కలిపి ఎమ్మెల్సీ పేరిట ఆ వైద్యులకు, కళాశాల కార్యదర్శికి కొరియర్ ద్వారా పంపినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది.

దర్శన్ బెయిల్ రద్దు కోరుతూ సుప్రీంలో పోలీసుల పిటిషన్

బెంగళూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసు నిందితుడు, నటుడు దర్శన్ బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ పోలీసులు సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. దర్శన్ సహా నిందితులు అందరూ బెయిల్‌పై ఇటీవల విడుదలయ్యారు. నిందితులలో దర్శన్ సహా ఏడుగురి బెయిల్‌ను రద్దు చేయాలని బెంగళూరు పోలీసులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రేణుకాస్వామి హత్య కేసులో 17 మందికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వ సూచనతో పోలీసుల తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది అనిల్ సి నిశాని సోమవారం పిటిషన్ వేశారు. నటుడు దర్శన్, పవిత్ర గౌడ, లక్ష్మణ్, ప్రదోశ్, నాగరాజు, అనుకుమార్, జగదీశ్ బెయిల్‌ను రద్దు చేయాలని అందులో కోరారు. గత ఏడాది డిసెంబరు 13న ఈ ఏడుగురికి బెయిల్ లభించింది.

మిల్లర్ కింద పడి వ్యక్తికి తీవ్రగాయాలు


నల్లచెరువు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లిలో సీసీరోడ్డు వేస్తుండగా హైజక్ మిల్లర్ కిందపడి అదే గ్రామానికి చెందిన హనుమంతురెడ్డి సోమవారం తీవ్రంగా గాయపడ్డాడు. కమ్మరవారిపల్లిలో సిమెంటు రోడ్డు వేస్తుండగా సిమెంటు, కంకర కలిపే యంత్రం కింద పడి గాయపడ్డాడు. ఆ వ్యక్తి చెవిటి, మూగ కావడంతో ఈప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. గాయపడిన ఆ వ్యక్తిని ప్రైవేటు వాహనంలో కదిరి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పి ..

బుక్కపట్నం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూనిపల్లి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో క్రిష్ణాపురం గ్రా మానికి చెందిన రమణ తీవ్రంగా గాయపడ్డాడు. బుక్కపట్నం నుం చి తన స్వగ్రామమైన క్రిష్ణాపురానికి బైక్‌పై వెళ్తుండగా... గూనిపల్లి గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి. కిందపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ క్రిష్ణమూర్తి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన అతన్ని ఆసుపత్రికి తరలించారు.

బైక్‌లు ఢీకొని..

ధర్మవరం రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి క్రాస్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు సోమవారం రాత్రి ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయ పడ్డా డు. ధర్మవరం పట్టణం మార్కెట్ వీధికి చెందిన నరేష్ తన బైక్‌లో అనంతపురం నుంచి ధర్మవరానికి వస్తుండగా... గొల్లపల్లి క్రాస్ వద్ద ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నరేష్‌ను స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.17	1,589.03
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,146	0
నీటి నిల్వ (టీఎంసీలు)	77.04	10.24



పూజలందుకుంటున్న సీతారాములు

ఘనంగా సీతారామ కల్యాణం

సిరుగుప్ప, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం తాలుకాలోని శ్రీనగర్ క్యాంపులో భక్తులు కల్యాణం నిర్వహిచారు. ఈ సందర్భంగా గణపతి పూజ, సీతారాములకు ప్రత్యేకాలంకరణ, పుష్పాలంకరణ నిర్వహించారు.

తేజ ప్రసాద్ కన్నుమూత

● మెడికల్ కాలేజీకి పార్థివ దేహం



తేజ ప్రసాద్ (ఫైల్)

అనంతపురం ప్రెస్‌క్లబ్/అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు తేజ ప్రసాద్(66) సోమవారం కన్నుమూశారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయన అసలు పేరు నందినేని దేవ ప్రసాద్. 1995 నుంచి దాదాపు 30 ఏళ్లుగా అనేక మీడియా సంస్థల్లో పనిచేశారు. స్ఫూర్తిదాయకమైన కథనాలు రాశారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రవేశించి, తేజ న్యూస్ చానల్ తరఫున సేవలు అందించడం ప్రారంభించారు. ఈ క్రమంలో ఆయనను తేజ ప్రసా ద్, జెమినీ ప్రసాద్ అని పిలుచుకునేవారు. మృదుస్వభావి, అందరితో కలుపుగోలుగా ఉండే ఆయన మృతి పట్ల ఉమ్మడి జిల్లా జర్నలిస్టులు, ఫొటో, వీడియో జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల నాయకులు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన పార్థివ దేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించాలని నిర్ణయించారు. అనంతపురం ప్రెస్‌క్లబ్ నుంచి మంగళవారం ఉదయం 10 గంటలకు అంతిమయాత్ర మొదలవుతుంది.

● సీనియర్ జర్నలిస్టు దేవ ప్రసాద్ మృతికి ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సంతాపం వ్యక్తం చేశారు. జిల్లాలోని తొలితరం జర్నలిస్టు, జర్నలిజానికి తన జీవితాన్ని అంకితం చేసిన దేవ ప్రసాద్ మృతి జర్నలిస్టు లోకానికి తీరని లోటు అని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

● సీనియర్ జర్నలిస్టు దేవ ప్రసాద్ మృతికి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ సంతాపం వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలంపాటు మీడియా రంగంలో పనిచేసిన ఆయన సేవలు మరువలేనివని వారు కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్థించారు.

● సీనియర్ జర్నలిస్టు దేవ ప్రసాద్ మాజీ మంత్రి, దివంగత పరిటాల రవీంద్రకు అత్యంత సన్నిహితులని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ గుర్తు చేసుకున్నారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయనకు కుటుంబ సభ్యులు లేకున్నా.. జర్నలిస్టులే కుటుంబమని, ఆయన జ్ఞాపకార్థం చేయాల్సిన పనులకు తమ కుటుంబం సహకరిస్తుందని తెలిపారు.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



కలశాలతో మహిళలు

మల్లన్నకు బ్రహ్మ'రథం'

బళ్లారి సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లికార్జునస్వామి, భ్రమరాంబల కల్యాణ మహోత్సవ ప్రచార రథానికి భక్తులు ఘన స్వాగతం పలికారు. సోమవారం బసవేశ్వర నగర్‌లోని సంగమేశ్వర స్వామి దేవాలయం నుంచి నగరంలో ఊరేగింపు ఘనంగా జరిగింది. మోకారోడ్డు, దుర్గమ్మ దేవస్థానం, పార్వతీనగర్, బసవభవన్ మీదుగా రథయాత్రను నిర్వహించారు. మల్లికార్జున స్వామి, భ్రమరాంబలకు రథంలో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కళ్యాణ మఠానికి చెందిన శ్రీను భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ బళ్లారిలోని బసవేశ్వర నగర్ దేవుడి ఇల్లు లాంటిదన్నారు. మల్లికార్జున స్వామి బళ్లారికి తరలి రావడం భక్తుల అదృష్టమన్నారు. ఊరేగింపులో వీరశైవ సమాజ నాయకులు, వీరశైవ విద్యావర్తక సభ్యులు, కార్యవర్గసభ్యులు అఖిల భారత వీరశైవ లింగాయత్ మహాసభ కమిటీ పదాధికారులు పాల్గొన్నారు.

అణువిద్యుత్ కేంద్రంపై ఆందోళన



ఆందోళన చేపట్టిన గంగావతి తాలూకా పరిధిలోని పలు గ్రామాల ప్రజలు

గంగావతి రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలో అణువిద్యుత్ కేంద్రం స్థాపించరాదంటూ... గంగావతి చుట్టుప్రక్కల గ్రామీణ ప్రాతాల ప్రజలు సోమవారం ఆందోళన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే హెచ్.ఆర్. శ్రీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళన కార్యక్రమంలో వందలాది మంది గ్రామీణ ప్రాంతాల ప్రజలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినిదాలు చేశారు. ఈ సందర్భంగా హెచ్.ఆర్.శ్రీనాథ్ మాట్లాడుతూ గంగావతి తాలూకా పరిధిలో అణు విద్యుత్ కేంద్రం స్థాపించేందుకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సరైనది కాదని, కొన్ని శతాబ్దాల చారిత్రక ప్రాముఖ్యను సంతరించుకున్న పర్యాటక క్షేత్రాలకు ముప్పు తప్పదన్నారు. ఆంజనేయుడి జన్మస్థానంగా పిలుచుకునే అంజనాద్రి బెట్ట, తదితర అధ్యాత్మిక ప్రాంతాలు ఉన్న ప్రాంతంలో అణు విద్యుత్ కేంద్రం స్థాపనతో ఇబ్బందులు తప్పవన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే సందర్భంగా అణు విద్యుత్ కేంద్రం స్థాపనకు కోసం భూమి సేకరణ జరపరాదని జిల్లాధికారి వ్యతిరేకంగా నినానాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీలకు అతీతంగా పలువురు నేతలు, స్వామీజీలు పాల్గొన్నారు.

ఏపీఎంసీ నూతన అధ్యక్షుడి ఎంపిక



హబీబ్ రెహ్మాన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, జనవరి 6(ఆంధ్ర జ్యోతి): కంప్లి ఏపీఎంసీ నూతన అధ్యక్షుడిగా హబీబ్ రెహ్మాన్ ఎంపికయ్యారు. సోమవారం రెహ్మాన్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జేఎన్ గణేష్ మాట్లాడుతూ హబీబ్ రెహ్మాన్‌పై నమ్మకంతోనే కీలక బాధ్యతలు అప్పగించామన్నారు. వ్యవసాయ కృషి మార్కెట్‌ను ఆయన అభివృద్ధి వైపు నడిపిస్తారన్నారు. మార్కెట్ అభివృద్ధికి మరిన్ని నిధులు సమకూర్చి సహకారం అందిస్తామన్నారు. రైతులకు, వ్యాపారస్తులకు అనుగుణంగా పనిచేస్తామని నూతన అధ్యక్షుడు హబీబ్ రెహ్మాన్‌తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన ఉపాధ్యక్షుడు శరణు గౌడ, కార్యదర్శి రాజాసాబ్, శ్రీనివాసరావు, మూకయ్య స్వామి, హేమయ్య స్వామి, బట్ట ప్రసాద్, వీరాంజనేయులు, చాంద్ బాషా, దేవలాపురం అంజినప్ప, మస్తాన్, నాగరాజు, మురారి, కొట్టూరు రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా అడ్డపల్లకి ఉత్సవం



అడ్డపల్లకి ఊరేగింపులో పాల్గొన్న స్వామీజీలు, భక్తులు

కంప్లి, జనవరి 6 (ఆంధ్ర జ్యోతి) : తాలుకా పరిధిలోని బుక్కసాగర వద్ద వుండే కరి సిద్దేశ్వర మఠంలో సోమవారం అడ్డపల్లకి మహోత్సవం ఘనంగా నిర్వహిం చారు. కేదార్ సంస్థాపకులు భీమ శంకర లింగ శివాచార్యులకు బుక్కసాగరలో అడ్డపల్లకి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వీరభద్ర శివాచార్య స్వాములు, మల్లికార్జున శివాచార్యులు, కరిసిద్ద ఈశ్వర శివాచార్యులు, వామదేవ మహంత శివాచార్యులు, క్రాంతివీర మహాస్వాములు తదితర మఠాధీశ్వరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమాజ సేవకులైన కుమారస్వామి తాత, గాలి బసవరాజుస్వాములకు కరిసిద్దేశ్వర అవార్డును పురస్కారం అందించారు. అనంతరం 11 మంది చిన్నారులకు శివదీక్షను అందజేశారు.



చిన్నారులకు శివదీక్ష అందిస్తున్న కరిసిద్ధ శివారాధ్యస్వాములు

కార్మిక కట్టడ పదాధికారుల ఎంపిక

బళ్లారిరూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక కట్టడ కార్మిక విభాగ రాష్ట్ర అధ్యక్షుడు మోకా మల్లేష్ నేతృత్వంలో నూతన పదాధికారులను ఎంపిక చేశారు. సోమవారం బళ్లారి మోతీ సర్కిల్ సమీపంలోని బుడా కార్యాలయంలో కార్మిక విభాగ జిల్లా అధ్యక్షుడిగా వన్నూరుస్వామి ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్, బళ్లారి నగర ప్రధాన కార్యదర్శి వీరేష్, సంఘటన కార్యదర్శి రాము, జిల్లా సంఘటన కార్యదర్శి పంపాపతి, పంపబద్దతో పాటు పలు గ్రామీణ ప్రాం తాల్లో తాలుకా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శులను ఎంపిక చేశా రు. రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశం వారికి నియామక పత్రాలు అందించి అభినందించారు.



నియమాకపత్రాలు అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్

అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవం



నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న రైతులు

కంప్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కుడితిని కృషి పత్తిన సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. 12 మంది సభ్యులు వుండగా అధ్యక్ష స్థానానికి యర్రిస్వామి, ఉపాధ్యక్ష స్థానానికి సిద్దమ్మనహళ్లి షణ్ముఖప్ప నామినేషన్ వేశారు. మిగతా పది మంది ఈ పోటీలో లేనందువలన వారినే అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఫిరోజ్ ఖాన్ తెలిపారు. అనంతరం గెలుపొందిన యర్రిస్వామి, షణ్ముఖప్పకు తోటి పది మంది సభ్యులకు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అంజనేయులు, రాజశేఖర్, చంద్రయ్య దొడ్డ బసప్ప, బీసన్న, వీకేసీ చంద్రప్ప, దొడ్డప్ప, సత్యప్ప, వెంకటరమణ బాబు, గోపాల్, అశోక్, అంజి, చంద్రమౌళి, విష్ణు, వెంకటేష్ పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల సంగీత ప్రదర్శన

బళ్లారి సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాఘవ మెమోరియల్, వ్యాగ్ ఇండియాట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా నాదోపాసన పాస్కల్ దిస్కూల్ ఆఫ్ ఆర్ట్స్ పాఠశాల విద్యార్థులచే వినూత్న సంగీతం, తబలా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. జగల్‌బందీ డ్యాన్స్ ప్రోగ్రాంతో అద్భుత ప్రదర్శన చేశారు. సంస్థ గౌరవ కార్యదర్శి ఎన్.ప్రకాశ్, అధ్యక్షుడుచెన్నప్ప, సంయుక్త అధ్యక్షుడు కోటేశ్వరావు అభినందించారు. ఈసందర్భంగా కార్యదర్శి రామాంజినేయులు, అనిల్ బాబు, కార్యవర్గ సభ్యులు కళాభిమానులు తరలివచ్చారు.

నేడు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ధర్మవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసనగర్‌లోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలను శనివారం వరకూ నిర్వహిస్తామన్నారు. మంగళవారం పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు.



పొలాల్లో పంటను, మట్టిని పరీక్షిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

మట్టిని పరీక్షించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

బళ్లారి సిటీ,జనవరి 6(ఆంధ్రజ్యోతివ): తాలూకాలోని సిడిగినమోల గ్రామ సమీపంలోని పరిశ్రమల వల్ల చుట్టుప్రక్కల గ్రామాల్లో భూసారం తగ్గి పంటలు నాశనమవుతున్నాయని రైతుల ఆరోపణల నేపథ్యంలో రాయచూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు సోమవారం పలు గ్రామాల్లో భూసారాన్ని పరీక్షించారు. కర్ణాటక రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల చెన్న దసరా, హొలెయ దసరా, మాల దసరా జనసేవా సమితి బెంగళూరు జిల్లారైతు, గ్రామాభివృద్ధి , పర్యావరణ పరిరక్షణ కమిటీ ఆఫీస్ బేరర్లు ఇటీవల రాయచూర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి తమ ఇబ్బందులు తెలియజేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం సిడిగినమోల గ్రామానికి చేరుకుని రైతుల ఫిర్యాదులను పరిశీలించారు. అనంతరం కారేకల్లు, బాలచింత, కే.వీరాపురం, మీనహళ్ళి గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి, మొక్కజొన్న, మినుము, మట్టి నమూనాలను తీసుకుని పరీక్షలకు పంపారు. వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం ఆధిపతి డాక్టర్ గిరీశ్, సభ్యులు డాక్టర్ కృష్ణమూర్తి, చంద్రనాయక్, రవి, పాలయ్య, బసవరాజు, అధికారులు రేఖ, మారుతీప్రసాద్, శివప్ప తదితరులు బృందంలో ఉన్నారు. ఈసందర్భంగా జిల్లా రైతు గ్రామాభివృద్ధి పర్యావరణ పరిరక్షణ కమిటీ కార్యాలయ అధికారులు వివిధ గ్రామాల రైతులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి : ఎమ్మెల్యే



ఏఈ హేమరాజుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారి సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని గడిగ చెన్నప్ప సర్కిల్ పరిసర ప్రాంతాల్లో రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే భరత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం సర్కిల్లోని టవర్ క్లాక్ పనులను పరిశీలించి వారు మాట్లాడుతూ దీన్ని ప్రారంభోత్సవానికి హాజరుకావాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విజ్ఞప్తి చేశామన్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈసందర్భంగా ప్రజాపనుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హేమరాజ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుదర్శన్‌రెడ్డి పనుల వివరాలను తెలిపారు.

సమయపాలనతో విజయం సాధించాలి

● విద్యార్థులకు'బెస్ట్' వ్యవస్థాపకులు కోనంకి రామప్ప సూచన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కోనంకి రామప్ప

బళ్లారి సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమయపాలన పాటించి విజయం సాధించాలని, జీవితంలో ముందుకు రావాలంటే ఆత్మవిశ్వాసం తప్పనిసరి అని బెస్ట్ కళాశాల వ్యవస్థాపకులు కోనంకి రామప్ప అన్నారు. నగర శివార్లలోని బెస్ట్ కళాశాలలో ద్వితీయ పీయూసీ విద్యార్థులకు సోమవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ముందుకు రావాలంటే నిరంతర కఠోర శ్రమ తప్పనిసరి అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలోఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. సంస్థ కార్యదర్శి మన్నెం శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని, విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర , మండల స్థాయి క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. భరతనాట్యం కథాకళి, జానపద నృత్యం, భక్తిగీతాలు అద్భుతంగా ప్రదర్శించారు. ఈసందర్భంగా విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి, ఐసీఎస్ఈ పాఠశాల ప్రిన్సిపాల్ లోకప్ప మైలాపూర్,రత్నకుమారి, హాస్టల్ సుబ్బరాయుడు, సుధ, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృతి పరిరక్షణ అందరి బాధ్యత

● ఆంధ్రకళా సమితి అధ్యక్షుడు ముల్లంగి చంద్రశేఖర్



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముల్లంగి చంద్రశేఖర్

బళ్లారి సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి తరం అందరిపై ఉందని ఆంధ్రకళా సమితి అధ్యక్షుడు ముల్లంగి చంద్రశేఖర్ చౌదరి అన్నారు. నగరంలోని కిత్తూరు రాణి చెన్నమ్మ పాఠశాల ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన 74వ వార్షిక రంగోలీ పోటీల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. భారతీయ ప్రాచీన ఆచార వ్యవహారాలను చిన్నారులు తెలుసుకునేందుకు ఇలాంటి పోటీలు దోహదపతాయన్నారు. పండుగల జరుపుకోవడంతో మన సంస్కృతిని కాపాడిన వారం అవుతామన్నారు. బళ్లారి మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ , ప్రస్తుత సభ్యురాలు ఎం.రాజేశ్వరీ మాట్లాడుతూ ఆంధ్రకళా సమితి బాలికలకు ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. న్యాయనిర్ణేత సౌమ్య మాట్లాడుతూ విద్యార్థులు, మహిళలు రోజువారీ కార్యక్రమాల్లో మార్పు తీసుకొస్తారన్నారు. ఈకార్యక్రమంలో ఆంధ్రకళా సమితి పదాధికారులు ఎం.రామాంజనేయులు, శామసుందర్, భీమనేనిభాస్కర్, భీమనేని ప్రసాద్, నరేంద్ర, రాజశేఖర్, జి.వెంకటేశులు, జి.ప్రభాకర్, నారాయణరెడ్డి, వెంకమాంబ, నేతిరఘురాం, రాజశేఖర్, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్



ఫుట్‌బోర్డుపై వేలాడుతున్న విద్యార్థులు

వేలాడితేనే.. వేళకు బడికి..!

● నిత్యం ఫుట్‌బోర్డు ప్రయాణంలోనే విద్యార్థులు

● బస్సుల కొరతతో తప్పని ఇబ్బందులు

హోసూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వేళకు బడికి, కళాశాలలకు వెళ్లాలంటే ఫుట్‌బోర్డు ప్రయాణం చేయాల్సిందే. నిత్యం ప్రాణాలు చేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. బస్సుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారుల్లో చలనం లేకుండా పోయింది. హోసూరులో పాఠశాల, కళాశాల సమయాల్లో మరిన్ని సర్వీసులు నడపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాల, కళాశాల వేళల్లో తగినన్ని సర్వీసులు లేకపోవడంతో ఫుట్‌బోర్డుపై వేలాడుతూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా బాగలూరు రోడ్డు, డెంకణీకోట మార్గంలో ఉదయం, సాయంత్రం వేళల్లో కార్మికులతోపాటు విద్యార్థుల రద్దీ అధికంగా ఉంటోంది. ప్రయాణీకులు, విద్యార్థుల సౌకర్యం దృష్ట్యా తగినన్ని బస్సులు నడపాలని కోరుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు చలించలేదని వారు అంటున్నారు. విద్యార్థులకు ప్రత్యేక బస్సులు నడపాలని కోరుతున్నారు. పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బొప్పాయి రైతుకు భారీ దెబ్బ

● నత్త తెగులుతో తగ్గుతున్న దిగుబడి



వైరస్ సోకిన బొప్పాయి చెట్టు

హోసూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలోని హోసూరు, ముదుగానపల్లి, కెలమంగలం, బాగలూరు ప్రాంతాల్లో సుమారు 150 ఎకరాలలో బొప్పాయి సాగు అవుతోంది. స్థానికంగానే కాక పొరుగున ఉండే బెంగళూరు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. కొన్ని నెలలుగా కిలో బొప్పాయి రూ.50 ధర పలికింది. సాధారణంగా బెంగళూరుకు చెందిన వ్యాపారులు నేరుగా తోటల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. అయితే ఇటీవల కొన్నిరోజులుగా నత్త తెగులు వైరస్ సోకడంతో రైతులలో ఆందోళన నెలకొంది. దీంతో దిగుబడి తగ్గింది. వైరస్ కారణంగా చెట్టుపైనే కాయి కుళ్ళిపోతుంది. అంతే కాక చెట్లపై ఆకులు ఎండిపోయి రాలిపోతాయి. పండ్లు రుచి ఉండవు. ఉన్న పంటను కాపాడుకునేందుకు వ్యవసాయ అధికారులు తగిన సలహా సూచనలు చేయాలని కోరుతున్నారు.

ఫ్లై ఓవర్‌లో ఇరుక్కున్న పావురాన్ని కాపాడారు..

హోసూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): హోసూరు బస్టాండు ఎదురుగా ఉన్న ఫ్లై ఓవర్‌పై ఆహారంకోసం సోమవారం ఉదయం పెద్ద సంఖ్యల్లో పావురాలు వచ్చాయి. ఇందులో ఓ పావురం అక్కడి తీగకు చిక్కుకుంది. పావురం కాళ్ల తీగలో ఇరుక్కుపోవడంతో ఎగరలేకపోవడాన్ని స్థానికులు గుర్తించారు. ఆ ప్రాంతంలో టీ తాగేందుకు వెళ్లిన కార్పొరేషన్ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది నిచ్చెన సాయంతో పైకి ఎక్కి పావురం కాళ్లకు ఉన్న తాడును తొలగించారు. తర్వాత పావురాన్ని క్రిందకు దించి నీరు తాగించి భయం తొలగాక గాలిలోకి ఎగురవేశారు. అగ్నిమాపక సిబ్బందిని ప్రజలు అభినందించారు.



పావురాన్ని రక్షించిన దృశ్యం

ప్రతి గ్రామానికీ ఆర్టీసీ బస్సు: ఎమ్మెల్యే

కంప్లి, జనవరి 6 (ఆంధ్ర జ్యోతి) : సండూరు నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి బస్సుసౌకర్యం కల్పించి ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తామని సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ తెలిపారు. సోమవారం సండూరు నుంచి రాంపురం, బండ్రి, చోర్నూరు తదితర గ్రామాలకు నూతన బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ఏ సమస్య వచ్చినా నేరుగా తమను సంప్రదించి తమ సమస్యలు తెలిపినట్లయితే వెంటనే ఆ సమస్య పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో సండూరు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే సండూరులో పలువురు నూతన కార్యాలయాలను కూడా ప్రారంభిస్తాము. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నూతన బస్సును ప్రారంభిస్తున్న సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ